# నా మొగుడు పిరికోడు!

ఏ భార్య అయినా భర్త ధైర్యవంతుడు కావాలనుకుంటుంది. తన మాన ప్రాణాలకు రక్షణ భర్తేనని భావిస్తుంది.

ఆడదాని భావాలకు భిన్నంగ వున్నయ్ రోజులు! మగాళ్లలో సినిమా హీరోలకు మల్లే ఆగంతకుడి మీదికి లంఘించి ఫైట్లు చేసి... నడిరోడ్‌పై విన్యాసాలు ప్రదర్శించి భార్యని ముష్కరుల బారినుండి తప్పించి రక్షించే సాహసం చేయగలవాళ్ళు లేరనేది నేటి కటిక వాస్తవం!

అది సినిమా!... ఇది జీవితం!

నిజజీవితంలో అలాంటి సంఘటనలు అథవా ఎదురైనా పక్కనే వున్న మొగుడు మహాశయుడు కిమ్మనడు. తాను పరాయివాడితో తన్నులు తినటానికి సిద్ధపడడు. అథవా అంత అవసరమన్పిస్తే దగ్గర్లో వున్న పోలీస్‌స్టేషన్‌కెళ్ళి ఓ రిపోర్టిచ్చి తన పనైపోయిందన్నట్లు చేతులు దులుపుకుంటాడు. దట్సాల్! ఇదీ నేటి మగాళ్ళ ధైర్యం తాలూకు పరిస్థితి!

దొంగోడు ఇంట్లోకి జొరబడి కత్తి చూపించి సర్వం దోచుకుపోతే ఎ.సి.పి. అయినా సరే నోరెళ్లబెట్టక తప్పదు. అదేమంటే ఎవడి ప్రాణం వాడికి తీపి!

ఈ ఫార్ములా అర్థం చేసుకోబట్టే అడ్డమైన వెధవా బరితెగించి దొంగతనాలకు పాల్పడుతున్నాడు. దోచుకుంటున్నాడు.

★★★★★

టైటిల్ చూసి ఇది సినిమా కథ అనుకునేరు. ఈ కథలో మహేష్‌బాబు హీరో... దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు గారు డైరెక్టరూ కాదు.

ఇటీవల పాత సినిమా పేర్లతో మళ్ళీ మళ్లీ చాలా సినిమాలు వచ్చేస్తున్నయ్. పాపం పూర్ ప్రేక్షకులు చూచి ఆనందిస్తున్నారు.

సినిమాకంటే ముందు టైటిల్ ముఖ్యం! మంచి టైటిల్ దొరికితే కథ కాపీ కొట్టేయచ్చు ధైర్యంగ! సినిమా రైటర్సు దర్శకనిర్మాతలు అంతటివారు.

ఈవరుసక్రమంలో కాపీ కొట్టే జాడ్యం కథారచయితలకూ సంక్రమించింది. పత్రికలు తిరగేస్తుంటే అడపా దడపా కాపీ కథలు తారసపడటం కద్దు!

ఒకప్పుడు పత్రికాఫీసుల్లో ఎడిటర్ స్థానంలో మేధావులుండేవాడు. ఇప్పుడు వారిస్థానే రచయితలు జొరబడ్డారు. జొరబడి వూరుకుంటున్నారా?- లేదే! వచ్చిన కథల్లో నచ్చని వాటిని ఏరి పక్కనపెట్టి (అంటే చెత్తబుట్ట పాలు చెయ్యకుండా) తర్వాత తీరుబడిగ వాటిని మళ్ళీ చదివి అక్కడక్కడ మార్పులు చేసి టైటిల్‌మార్చి మారుపేరుతో మరో పత్రికకు పంపి పబ్లిష్

చేయించుకుంటున్నారు.

అందుకే... ఎందుకైనా మంచిదని నా కథల విషయంలో టైటిల్స్ రిజిస్టర్ చేయిస్తుంటాను. రిజిస్టరైన నా కథల టైటిల్ మీద సర్వహక్కులూ నావే! కాపీ కొడితే... అలాంటి వ్యక్తిపై లీగల్‌గా చర్య తీసుకునే వీలుంటుంది! అదీ సంగతి!

ఇక ఉపోద్ఘాతం విడిచిపెట్టి కథలో కొద్దాం!

చదివిన వారి గుండెలో ఈ కథ శరాఘాతమై గుచ్చుకుంటుంది లేదా విద్యుత్ ఘాతంలా తాకి చదువరులను మూర్ఛిల్లచేస్తుంది!

కథలో హీరో కామేష్ మిడిల్ క్లాస్ ఫ్యామిలీలో పుట్టాడు. చదువులో బ్రిలియంటేంకాదు. అయినా కాపీలు కొట్టకుండా పి.జి. చేసాడు. అటుపై కాంపిటీటివ్ ఎగ్జామ్ వ్రాసి క్లాసవన్ ఆఫీసర్ పోస్టకి సెలక్టయి అదృష్టంకొద్దీ ఇన్‌కమ్‌టాక్స్ డిపార్టమెంట్‌లో పడ్డాడు... తంతే గారెలబుట్టలో పడ్డట్టు!

కుడి కాలు ముందు పెట్టి డిపార్ట్‌మెంట్‌లో జాయినయ్యాడో ఏమో... వరుసగా డిపార్ట్‌మెంట్ టెస్టులు రాసి పాసై పెద్ద సింహాసనాధీశుడైనాడు.

ఐ.టి. డిపార్ట్‌మెంట్ అంటే అందరికీ హడలే! పేర్లు పదవులు చెప్తేనే చాలామందికి గుండెల్లో గుబులు పుడుతుంది. ముందుకొచ్చి నిలబడటానికి వెరుస్తారు. నోరువిప్పి అధిక ప్రసంగం చేయటానికి వెనకాడతారు.

డిపార్ట్‌మెంట్లో వారందరివీ ఎక్స్‌రే కళ్ళు. మనిషిని చూడగానే వాడు ఎస్సీ అవునో కాదో ఏటా ఎంత ఇన్‌కమ్‌టాక్స్ కట్టేవాడో బహుసులువుగా చెప్పేయగల మేధావులు.

ఆ కోవకి చెందిన వాడే కామేష్!

డిపార్ట్‌మెంట్‌లో అధికార గణానికి టెలిపతి తెల్సు! ఆ అసాధారణ విద్యలో ఆరితేరిన వాళ్ళే అందరూ!

ఆ డిపార్ట్‌మెంట్ అంటేనే బంగారు బాతు. ఎంతో పుణ్యం చేసుకుని గత జన్మలో ఎన్నో నోములు నోస్తేనేగాని ఈ జన్మలో అలాంటి డిపార్ట్‌మెంట్లో జాబ్ దొరకటం దుర్లభం! అందునా హయ్యర్ పోస్ట్‌లో వుద్యోగమంటే చెప్పాల్సిన పన్లేదు.

కార్లు... బంగళాలు... బ్యాంక్ అకౌంట్లు... బినామీ ఆస్తులు... లాకర్లు... పొలాలు... స్థలాలు... వెండి బంగారం వేటికీ కొదవ వుండదు.

ఐ.టి. వారిపై ఎ.సి.బి. దాడులు జరగవ్! ఆ దాడి జరిపే వారి జాతకం తవ్వి వాడి తాట తీస్తారంతే! అదీ భయం!

సారీ!... కథలో ముందుకు పోవాలి కదూ?!

కామేష్‌కి లంచం పుచ్చుకోవటమంటే ఎలర్జీ! చెడ్డ చిరాకు! అతని దృష్టిలో లంచమనేది కుష్ఠువ్యాధి లాంటిది. వ్యాధి నివారణకు మందుల్లేవు. (కుష్ఠునివారణకున్నాయిలెండి)

అదంతా ఎందుకుగానీ... కామేష్ మాత్రం మడి కట్టుకున్న మనిషి! చేయి చాచడు. ఎవరైనా ఇవ్వ సాహసిస్తే ఫైరవుతాడు.

డిపార్ట్‌మెంట్ ఇచ్చిన కారు... నెల నెలా వచ్చే జీతం... ఆఫీసులో ఫ్యాను... ఇంటివద్ద రెసిడెన్షియల్ నౌకరు... లోను తీసుకుని కట్టుకున్న ఇల్లు... ఇవి చాలనుకుని తృప్తిపడే అధికారి!

కామేష్‌కి చవర్లెట్ కారులాంటి అర్ధాంగి. ఇద్దరు పుత్రరత్నాలు... ముగ్గురు ఆడపిల్లలు అతనికి ఎసెట్స్.

భార్య శైలజ దృష్టిలో కామేష్ శ్రీరామచంద్రుడు. అన్నీ మంచి అలవాట్లే! క్లబ్‌లకు బార్‌లకు వెళ్ళే అలవాటు లేదు. సిగరెట్ అంటేనే సరిపడదు.

అంతవరకు బాగానే వుంది! ఫ్యామిలీ సజావుగా సాగిపోతోంది. కామేష్‌కొచ్చే నెలజీతం అవసరాలకు సరిపోతోంది.

కాకుంటే... పిల్లలు పెద్ద చదువులకు వచ్చాకనే సమస్యలు మొదలైనయ్. పిల్లల టాలెంట్ మాటెలా వున్నా ఇంజనీరింగ్ మెడిసిన్ వంటి కాస్ట్లీ ఎడ్యుకేషన్ కావాలంటే లక్షల్లో డొనేషన్ అవసరమౌతుంది.

ఆడపిల్లలను అత్తారిళ్ళకు పంపాలంటే తమస్థాయికి తగిన మేచ్ రావా(కావాల)లంటే బోలెడు 'డౌరీ' ఆఫర్ చేయాల్సి వస్తోంది.

పైగా మగపిల్లలను అమెరికా పంపాలన్నా ప్రాబ్లమే! బ్యాంకులోను తీసుకోవచ్చు! తీరా ఆ బాకీలు తీర్చలేని పరిస్థితి ఎదురైతే?-

ఈ విషయాలు గుర్తుకొచ్చిన ప్రతిక్షణం శైలజ గుండెల్లో రైళ్ళు పరుగిడుతుంటయ్!

★★★★★

అవసరాలు గడవటానికి లంచం పుచ్చుకోమని కామేష్‌ని తెగ సతాయిస్తోందీ మధ్య శైలజ.

లంచం పుచ్చుకోవటం చేతకాదన్నాడు. నేరమన్నాడు! ఇంకా ఎన్నో నీతి వాక్యాలు వల్లించాడు. తనవల్ల కాని పని అంటూ మొత్తుకున్నాడు.

శైలజ విన్లేదు. అభ్యాసం కూసు విద్య అంది. కొత్తల్లో ఇబ్బందన్పించినా రాను రాను అదే అలవాటైపోతుందని నచ్చచెప్పింది. ఒకసారి అలవాటైతే లంచం పుచ్చుకోవటం మామిడిరసం అంత మధురంగ... బందరు లడ్డూలా తియ్యగా వుంటుందని మొగుడ్ని దువ్వింది శైలజ.

ప్రతిరాత్రీ బెడ్‌మీదికి రాగానే ఇదే తొముడు తట్టుకోలేకపోతున్నాడు. బుర్ర తినేస్తున్న భార్యకు ఎలా నచ్చచెప్పాలో అర్థంకాక తికమకపడిపోతున్నాడు కామేష్.

అద్దం ముందు నిలబడి తల దువ్వుకుంటూండగ తన ప్రతిబింబం హేళన చేస్తున్నట్టన్పించసాగింది. ఇంతచేతగాని వాజమ్మవాని వెక్కిరిస్తోంది ప్రతిరూపం! నువ్వోతి చవటవి... పిరికి సన్నాసివి అంటూ శాపనార్థాలు పెడుతోంది.

ఛీ నోర్ముయ్! అన్నాను!... షటప్ అన్నాను. అయినా ప్రతిబింబం నన్ను వెక్కిరిస్తూనే వుంది..

నువ్వొక్కి 'ఫూల్'వి అంది! సుఖపడటం చేతగాని వాజమ్మంది.

ఇంత పెద్ద పోస్టులో వుండి ముగ్గురి ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేయటం చేతగాని అశక్తుడివా? అంది. పిల్లలిద్దర్నీ అమెరికా పంపలేకపోతున్న బలహీనుడివా? అంది.

నా మాట విన్నా!... వినీ... కొంచెం లౌక్యం నేర్చుకో?... నీ అవసరాలు తీర్చుకో... తప్పులేదంటూ ఒకవేపు అద్దంలో ప్రతిరూపం... మరోవేపు శైలూ నన్ను గందరగోళ పెడుతున్నారు.

అందరికదీ ఒక తోవ అయితే ఉలిపి కట్టెది వేరొక త్రోవ అన్నట్టు... నువ్వొక్కడివే తడిగోచీ పెట్టుకుని మడికట్టుకూర్చుంటే ఈ దేశమేం బాగుపడిపోదు. రాజకీయ నాయకులను... తోటి అధికారగణాన్ని చూసైనా నేర్చుకోరేం?... అంటూ నోట్లో యింత గడ్డిపెట్టింది.

లంచం ఐస్క్రీమ్లాంటిది! ఒక్కసారి రుచి మరిగితే... ఇంకా ఇంకా తినాలనిపిస్తుంది. లంచాలు పుచ్చుకోవటంలో నేర్పరులున్నారు. నిష్ణాతులున్నారు. వారి వద్దకెళ్ళి ట్రెనింగ్ అయిరా! అని కూడా సలహా ఇచ్చింది మనసు ప్లస్ శైలజ!

నువ్వో పిరికి వెధవ్వి! బ్రతకటం చేతగాని వాడివి! అవసరాలు తీర్చుకోలేని అసమర్థుడివి! దమ్మిడీకి కొరగానివాడివి... ఛీ! పో! నిన్ను మార్చటం ఎవరి తరముకాదు అంటూ కామేష్ అంతరాత్మ... బెటర్ హాఫ్ చెప్పి చెప్పి విసిగిపోయారు.

ఎవరెన్ని చెప్పినా తాను మాత్రం సత్యహరిశ్చంద్రుడి తమ్ముడిలా... ధర్మరాజుకి బ్రదర్లాగానే వుండిపోవటానికి తీర్మానించుకున్నాడు కామేష్!

★★★★★

మొగుడు లంచాలు తీసుకోవడం చేతగాని నపుంసకుడు అనుకున్నదో ఏమో... శైలజ స్వతంత్రంగా ఆలోచించి ఓ చక్కటి నిర్ణయానికి రావాలని తెగ ప్రయాస పడుతోంది.

ఆలోచించగా... చించగా ఓ అద్భుతమైన ఆలోచన మెరుపులా తలుక్కున బుర్రలో మెరిసింది.

పాత తెలుగు దినపత్రికలన్నీ ముందేసు కూర్చుంది శైలజ.

పండుగలకు స్పెషల్ ఆఫర్స్ ఇచ్చేవారి ప్రకటనలు... స్కీమ్సు పెట్టి పెద్దఎత్తున లాటరీ నిర్వహిస్తూ బంగారు నగలు... పట్టుచీరెలు... కార్లు... లక్షల క్యాషు ఇవ్వమన్న వ్యాపారస్తులు... షాపింగ్మాల్స్ వారి టెలిఫోన్ నెంబర్లు వెతికి తీసి... వరసగ ఒకరి తర్వాత మరొకరికి ఫోన్కొట్టి మధ్యాహ్నం లంచ్ తర్వాత వారినొచ్చి ఇంట్లో కలవమంటూ ఆదేశాలు జారీచేసింది శైలజ.

ఫోన్చేసిన శైలజ ఎవరో ఆమె భర్త అధికారస్థాయి ఏమిటో ఎరిగిన వ్యాపారస్థులంతా కామేష్ ఇంటికొచ్చి రెక్కలు కట్టుకు వాలేరు.

వచ్చిన వారందరినీ కూర్చోమనా ప్యూన్చేత డ్రింక్స్ సర్వ్ చేయించి అసలు విషయం మాట్లాడటానికి వుపక్రమించింది శైలజ!

'లుక్! చూడండీ... మీ పండుగ ఆఫర్స్ వ్యాపార ప్రకటనలు చూసాను. అన్నీ వెరీగుడ్. మీ పబ్లిసిటీ అద్భుతంగ వుంది.

విన్నర్స్‌ని లాటరీ ద్వారా నిర్ణయించి బహుమతులు అందచేస్తామంటున్న మీ ఆలోచన అభినందనీయం!'

'ఇక్కడొక స్మాల్ ఎమెండ్‌మెంట్. మీరు తీయనున్న డ్రాలో ప్రథమ బహుమతి గ్రహీతల పేర్లు మాత్రం మావి వుండాలి! వస్తువులు కొన్నా కొనకపోయినా మా ఇంటి సభ్యులే విన్నర్స్‌గా ప్రకటించి ఆ బహుమతులు... క్యాష్... గోల్డ్... కార్లు... అన్నీ మాకు స్వంతం చేయాలి! అందుకు తగిన ఏర్పాట్లు తెలివిగా మీరే చేసుకోవాలి! అర్థమైందనుకుంటాను...' తన అంతరంగంలోని ఆలోచనని బహిర్గతం చేసింది శైలజ!

అక్కడున్న వ్యాపారస్తులు ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. కాదనగల ధైర్యం వారిలో లేకపోయింది.

'కాదన్నారో... మీ షాపులమీద ఇన్‌కమ్‌టాక్స్ రైడింగ్‌లు తప్పవు. మీ అక్రమ వ్యాపారాల లొసుగులన్నీ బైటికొస్తయ్. మీ రెప్యుటేషన్ పోతుంది. ఆలోచించుకోండి...' హెచ్చరిక జారీ చేసినట్టు మాట్లాడింది.

అక్కడున్న వారి గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టయింది. అడకత్తెరలో పోకచెక్కలా తమ సమస్య పరిష్కారం కావాలంటే అమ్మగారి ప్లాన్‌కి తలూపి 'యస్' అనక తప్పదన్పించటంతో ముక్తకంఠంతో అందరూ తమ అంగీకారాన్ని తెలిపారు.

'ఈ విషయం ఎక్కడా ఎవరికీ లీక్ అవటానికి వీల్లేదు. మేమే బహుమతి గ్రహీతలమని తెల్పి బహుమతులను మాకందజేస్తూ ఫోటోలు... వీడియోలు తీయించి అన్ని పత్రికల్లోనూ 'న్యూస్' అచ్చు అయ్యేలా చూడండి!- అర్థమైంది కదా?- ఇక మీరు వెళ్ళచ్చు...' అని వచ్చిన వారికి సెండాఫ్ ఇచ్చింది శైలజ.

తన ప్లాన్ ఏమిటో భర్తక్కూడా తెలియనివ్వలేదు. ఇంట్లో ఎవ్వరూలేని సమయం చూచి తను ఈ పనికి పూనుకుంది. అందుకే అంతా గప్‌చుప్‌గా జరిగిపోయింది!

ఇంకేముంది?... వారం గడిచేలోపు షాపింగ్‌మాల్స్‌వారు బహుమతులు ప్రకటించి ఫస్ట్‌ప్రైజ్‌లు వచ్చినవి స్వీకరించమంటూ శైలజ కుటుంబసభ్యులపేర ఆహ్వానాలొచ్చినయ్.

బహుమతుల విలువ అంతా కలిపి దగ్గర దగ్గర కోటి రూపాయల సొత్తు కామేష్ ఫ్యామిలీ మెంబర్స్ పరమైంది.

పిరికి భర్తకి తెలివైన భార్య తీసుకున్న నిర్ణయమే... ఈ కథకి ముగింపైంది!!

- సమాప్తం -